పల్లెల్లో మద్యం ప్రవాహం

- విచ్చలవిడిగా మద్యం విక్రయాలు
- మద్యం కిక్కుతో హరిస్తున్న ప్రాణాలు
- దుకాణాల్లో సిట్టింగ్ రూమ్‌ల ఏర్పాటు
- పట్టించుకోని ఎక్సైజ్ శాఖాధికారులు



కొత్తచిలుకూరులో మద్యం షాపు



మూలపాడులో జాతీయ రహదారి పక్కన బెల్ట్ షాపులో మద్యం అమ్మకాలు

ఇబ్రహీంపట్నం: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత మండలంలో మద్యం ఏరులై పారుతోంది. మద్యం దుకాణాలకు అనుబంధంగా బెల్ట్ షాపులు ఏర్పాటు చేసి పేదలను మద్యానికి బానిసలుగా మార్చుతున్నారు. ఇంత జరుగుతున్నా ఎక్సైజ్ శాఖాధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. మండలంలో ప్రభుత్వ లాటరీ ద్వారా ఐదు మద్యం దుకాణాలు ఉండగా, బెల్ట్ షాపులు సుమారు 60 వరకు ఉన్నాయి.

గ్రామాల్లో బెల్ట్‌షాపుల హవా

ఇబ్రహీంపట్నం మండల పరిధి గ్రామాలతో పాటు కొండపల్లి మున్సిపాల్టీలో బెల్ట్‌షాపుల హవా కొనసాగుతోంది. కిరాణా దుకాణాలు, బడ్డీ కొట్లు, నివాస గృహాలు, ప్రత్యేక షెడ్లు ఏర్పాటు చేసి మద్యం విక్రయిస్తున్నారు. మద్యం దుకాణంలో నిబంధనలకు విరుద్ధంగా సిట్టింగ్ రూమ్‌లు ఏర్పాటు చేసి పూటుగా తాగిస్తున్నారు. అందుబాటులో ఉన్న బెల్ట్ షాపుల ద్వారా రాత్రీపగలు యథేచ్ఛగా మద్యం అమ్మకాలు జరుపుతూ కూటమి నేతలు సంపద సృష్టించుకుంటున్నారు. మద్యం తాగుతున్న పేదలు మాత్రం తమ ఆరోగ్యాలు, జేబులు గుల్ల చేసుకుంటున్నారు. కొంత మంది పూటుగా తాగి తమ ప్రాణాల మీదకు తెచ్చుకోవడంతో కుటుంబ సభ్యులు దిక్కులేనివారుగా మారుతున్నారు.

మద్యానికి బానిసలై మృత్యువాత

గ్రామాల్లో రాత్రీ పగలు మద్యం అందుబాటులో ఉండటంతో పేదలు మద్యానికి బానిసలవడంతో ఈ మధ్య కాలంలో ఇద్దరు వ్యక్తులు మృత్యువాత పడ్డారు. దాములూరుకు చెందిన వ్యక్తి కొత్త చిలుకూరు మద్యం షాపులో మద్యం సేవించి అక్కడే మృత్యువాత పడగా, కిలేశపురం గ్రామానికి చెందిన జూటూరి నాగరాజు జూపూడి వైన్ షాపు సమీపంలో పంట కాలువలో పడి మృతి చెందాడు.

గ్రామాల్లో విచ్చలవిడిగా లభించే మద్యం రెండు కుటుంబాల్లో తీరని వేదన మిగిల్చింది. వెలుగులోకి రాని మరణాలు మరెన్నో ఉంటాయని ప్రజలు చెబుతున్నారు. గ్రామాల్లో విచ్చలవిడిగా విక్రయిస్తున్న మద్యాన్ని అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

మృతుల కుటుంబాల్లో విషాదం..

మద్యం తాగి మరణించిన వారి కుటుంబాల్లో విషాద చాయలు అలుముకున్నాయి. దాములూరులో మృతి చెందిన వృద్ధుడికి ఓ కుమారుడు ఉన్నాడు. వివాహం అయినప్పటికీ ఉమ్మడి కుటుంబంగా తన తండ్రిపై ఆధారపడి ఉండేవాడు. తండ్రి లేకపోవడంతో వారి కుటుంబం చిన్నాభిన్నంగా మారింది. కిలేశపురంలో మద్యం తాగి మరణించిన జూటూరి నాగరాజు క్వారీలో కూలి పని చేస్తూ తమ ఇద్దరు కుమారులను చదివించి వెయిట్ లిఫ్టింగ్‌లో కోచింగ్ ఇప్పించాడు. పెద్ద కుమారుడు కోటేశ్వరరావు ఖేలో ఇండియాలో పతకం సాధించి స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం సంపాదించాడు. కాయకష్టంతో కుమారుడిని ఉద్యోగంలో స్థిరపడేలా చేసిన తండ్రి వారి కళ్ల ముందు కనిపించక పోవడంతో వారి కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.



ప్రజల ప్రాణాలు పోతున్నాయి

ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన మద్యం పాలసీతో వీధికో బెల్ట్‌షాపు ఏర్పాటు చేశారు. మద్యం సేవించి అనేక మంది ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. వారి కుటుంబాలకు ఆసరా లేకుండా పోతోంది. బిడ్డలు అనాథలుగా మారుతున్నారు. అధికారులు తక్షణం మద్యం దుకాణాల్లో సిట్టింగ్ రూమ్‌లు, బెల్ట్‌షాపులు ఎత్తివేయాలి.

– గోగులమూడి రాణి, కొండపల్లి

చర్యలు తీసుకుంటాం

మద్యం సేవించి ఎవరూ చనిపోలేదు. అలా అయితే లక్షల మంది మరణిస్తారు. మద్యం ప్రియులు మితిమీరి తాగకుండా జాగ్రత్తలు తీసుకుంటే మంచిది. నిబంధనల మేరకు ఇప్పటికే అనేక బెల్ట్ దుకాణాలు మూసి వేయించాం. అనధికారికంగా ఎక్కడైనా బెల్ట్ షాపులు, సిట్టింగ్ రూమ్‌లు ఉంటే వాటిపై కూడా చర్యలు తీసుకుంటాం.

– గోపాలకృష్ణ, ఎక్సైజ్ శాఖ సీఐ, భవానీపురం

అణగారిన వర్గాల ఆశాజ్యోతి పూలే

మాజీ మంత్రి జోగి రమేష్



ఇబ్రహీంపట్నంలో పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జోగి రమేష్, నాయకులు



తిరువూరులో నివాళులర్పిస్తున్న స్వామిదాసు తదితరులు



మైలవరం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న నాయకులు, కార్యకర్తలు



జి.కొండూరులో నివాళులర్పిస్తున్న నాయకులు



నూజివీడులో పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



చాట్రాయిలో నివాళులర్పిస్తున్న నాయకులు

ఇబ్రహీంపట్నం: అణగారిన వర్గాల అభ్యున్నతికి అహర్నిశలు కృషి చేసిన మహోన్నత వ్యక్తి మహాత్మ జ్యోతిరావు పూలే అని మాజీ మంత్రి జోగి రమేష్ అన్నారు. ఇబ్రహీంపట్నంలో వైఎస్సార్ సీపీ బీసీ విభాగం ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే జయంతి కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ సమాజంలో ఆడపిల్లల చదువు కోసం, అంటరాని తనం నిర్మూలనకు పూలే తన జీవితాన్ని అంకితం చేశాడన్నారు. ఎన్నో పాఠశాలలు, వసతిగృహాల ద్వారా పేద విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపిన మహనీయుడు అని కొనియాడారు. నేటి యువతరం ఆయన అడుగుజాడల్లో నడవాలన్నారు. పేదలకు పండ్లు పంచారు. కొండపల్లిలో వైఎస్సార్ సీపీ నాయకులు పూలే విగ్రహానికి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి వేములకొండ తిరుపతిరావు, సహాయ కార్యదర్శి మేడపాటి నాగిరెడ్డి, జిల్లా ఐటీ వింగ్ అధ్యక్షుడు పచ్చిగోళ్ల పండు, మిక్కిలి శరభయ్య, బీసీ నాయకులు కుంచం జయరాజు, గుంజా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. గుంటుపల్లి రైల్వే వ్యాగన్ వర్క్‌షాపులో ఓబీసీ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు ఎల్ఎస్ఆర్కే ప్రసాద్, బీఎల్వీ ప్రసాద్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు.

చిరస్మరణీయుడు

తిరువూరు: సామాజికంగా అణచివేతకు గురైన బలహీన వర్గాలకు అండగా నిలిచి వారి అభ్యున్నతికి తోడ్పడిన మహాత్మ జ్యోతిరావు పూలే చిరస్మరణీయులని వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు అన్నారు. తిరువూరు నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో జ్యోతిరావు పూలే జయంతి కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కులపరంగా సమాజం విడిపోయిన రోజుల్లో దళితులు, బడుగు వర్గాల సంక్షేమానికి, వారి విద్యాభివృద్ధికి పూలే చేసిన కృషి మరువలేనిదన్నారు. చదువుతోనే సమాజంలో మార్పు వస్తుందని నమ్మిన పూలే సామాజిక అసమానతల నిర్మూలనకు విశేషంగా కృషి చేశారని కొనియాడారు. జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ నల్లగట్ల సుధారాణి, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కాలసాని విజయలక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల, పట్టణ అధ్యక్షులు తాళ్లూరి నవీన్‌కుమార్, చలమాల సత్యనారాయణ, ఆంజనేయపురం సర్పంచి మామిడి కుటుంబరావు, తిరువూరు నగర పంచాయతీ కౌన్సిలర్లు పరసా శ్రీనివాసరావు, గుంటూరు మస్తాన్ తదితరులు పాల్గొన్నారు. తిరువూరు నగర పంచాయతీ కార్యాలయంలో కమిషనర్ లోవరాజు, సిబ్బంది, పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ సత్యనారాయణ, సిబ్బంది, తిరువూరు నియోజకవర్గ కాంగ్రెస్ కార్యాలయంలో నాయకులు పల్లెపాటి శ్రీనివాసరావు, జీవన్‌బాబు తదితరులు జ్యోతిరావు పూలేకు నివాళులర్పించారు.

- **ఇబ్రహీంపట్నం:** ఎన్టీటీపీఎస్‌లో విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సంస్థ ప్రధాన గేటు వద్ద పూలే విగ్రహానికి ఎన్టీటీపీఎస్ చీఫ్ ఇంజినీర్ టి.నాగరాజు, ఏపీ జెన్‌కో శిక్షణా కేంద్రం సీఈ బి.శ్రీధర్, ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముప్పసాని రామకృష్ణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. యూనియన్ నేతలు నారాయణరావు, సింకా శ్రీహరి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.
- **జి.కొండూరు:** బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి మహాత్మ జ్యోతిరావు పూలే చేసిన సేవలు ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు జడ రాంబాబు అన్నారు. మండల పార్టీ ఆధ్వర్యంలో జి.కొండూరులో జ్యోతిరావు పూలే జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పూలే చిత్రపటానికి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. కేకును కట్ చేశారు. సర్పంచ్‌లు, పార్టీ నియోజకవర్గ వివిధ విభాగాల కన్వీనర్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.
- **మైలవరం:** సామాజిక న్యాయం, సమానత్వం కోసం మహాత్మ జ్యోతిరావు పూలే పరితపించారని రెడ్డిగూడెం వైస్ ఎంపీపీ, వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి చాట్ల రాబర్ట్ అన్నారు. రెడ్డిగూడెంలో పూలే చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు కుప్పిరెడ్డి వరప్రసాదరెడ్డి, మైలమాల కాంతారావు, గుడిసె ప్రభాకరరెడ్డి, గుడిసె జమలారెడ్డి, పైడిమర్ల శ్రీనివాసరెడ్డి, గురిజాల సుదర్శనం తదితరులు పాల్గొన్నారు.

సమసమాజ నిర్మాణానికి పోరాడిన పూలే

మైలవరం: సమాజంలో కుల వివక్ష, అన్యాయాలను రూపుమాపడానికి తన జీవితాన్ని ధారపోసిన మహనీయుడు జ్యోతిరావు పూలే అని వైఎస్సార్ సీపీ మైలవరం మండల అధ్యక్షుడు జి. వెంకట్రావు అన్నారు. మైలవరంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు పాలా నారాయణరెడ్డి అధ్యక్షతన పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఏఎంసీ మాజీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ పామర్తి శ్రీనివాసరావు, చామల సీతారామిరెడ్డి, ఇస్లావత్ స్వామి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. మహాజన సోషలిస్ట్ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఇంకొల్లు జమలయ్య, యలమర్తి నాగరాజు, కొంగల రామారావు, ఒలేటి ఏసు, దూరు దాసు తదితరులు పాల్గొన్నారు.

కులవ్యవస్థ నిర్మూలనకు పూలే కృషి ..

నూజివీడు: సమాజంలో కులవ్యవస్థ నిర్మూలనకు, సమ సమాజ స్థాపనకు, స్త్రీ, పురుషులకు సమాన హక్కులు కల్పించేందుకు కృషి చేసిన గొప్ప సంఘ సంస్కర్త జ్యోతిరావు పూలే అని వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షులు శీలం రాము అన్నారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధికార ప్రతినిధి కంచర్ల లవకుమార్, నాయకులు సలుమూరి మూర్తి, సర్పంచి ఉదయరాజు, జమలయ్య, సుగుణరావు, ప్రత్తిపాటి జోజి పాల్గొన్నారు.

- ఎమ్మార్ అప్పారావు పీజీ కేంద్రంలో పూలే చిత్రపటానికి కృష్ణా యూనివర్సిటీ వైస్ చాన్సర్ ఆచార్య కూన రాంజీ పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ జె.నవీన లావణ్యలత, అధ్యాపకులు షేక్ అన్వర్‌బాషా, టి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో నాయకులు పూలే చిత్రపటానికి నివాళులర్పించారు.
- **చాట్రాయి:** మండలంలోని చిన్నంపేట గ్రామంలో జ్యోతిరావు పూలే చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కొమ్ము ఆనందం, పంచాయతీ కార్యదర్శి సీహెచ్ పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.
- **ముసునూరు:** మండల పరిషత్ కార్యాలయంలో పూలే చిత్రపటానికి ఎంపీడీఓ కార్యాలయ ఏఓ ఛాయాకుమారి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఎంఈఓ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎస్టీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు జీవీ రత్నం, కొప్పుల బాబూరావు నివాళులర్పించారు. జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే చిత్రపటాలను ఎంఈఓ బీవీఎస్ సుబ్బారావుకు అందజేశారు.

వక్ఫ్ సవరణ బిల్లుపై నిరసన ప్రదర్శన



తిరువూరులో ప్రదర్శన నిర్వహిస్తున్న ముస్లింలు



డెప్యూటీ తహసీల్దార్ మోతియాకు వినతిపత్రం అందజేస్తున్న ముస్లింలు

మైలవరం: వక్ఫ్ సవరణ బిల్లు రాజ్యాంగ విరుద్ధమని మైలవరం మసీదుల కమిటీ ప్రెసిడెంట్ ఖాజా మొహియుద్దీన్ అన్నారు. ఎన్టీఆర్ జిల్లా మైలవరంలో వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా మసీదుల పెద్దలతో కలిసి ముస్లింలు శుక్రవారం నల్ల బ్యాడ్జీలు ధరించి ప్ల కార్డులతో మైలవరంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ముస్లిం నాయకులు మాట్లాడుతూ వక్ఫ్ సవరణ బిల్లుకు మద్దతు తెలిపిన పార్టీలు తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డెప్యూటీ తహసీల్దార్ మోతీయాకు అందజేశారు. ముస్లిం మత పెద్దలు ఇబ్రహీం, కరీందాదా, షేక్ సుభానీ, షఫీ, షేక్ రహీం తదితరులు పాల్గొన్నారు.

తిరువూరులో ప్రదర్శన..

తిరువూరు: వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ తిరువూరులో శుక్రవారం ముస్లింలు ప్రదర్శన నిర్వహించారు. జామియా మసీదు నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ప్రదర్శన జరిపిన అనంతరం కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ సవరణ బిల్లును రద్దు చేయాలని కోరుతూ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. జామియా మసీదు ఇమామ్ మౌల్వీ రజ్వీ, మసీదు కమిటీ అధ్యక్షుడు మొహిద్దీన్, ఉపాధ్యక్షుడు గాలిబ్, కోశాధికారి గౌస్, సభ్యులు కరీం, మహబూబ్, పలు మసీదుల నుంచి ముస్లింలు, మహిళలు పాల్గొన్నారు.

ముస్లింల శాంతి ప్రదర్శన..

విస్సన్నపేట: వక్ఫ్ చట్ట సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ విస్సన్నపేటలో శుక్రవారం ముస్లింలు శాంతి ప్రదర్శన జరిపారు. స్థానిక మసీదు సెంటర్ నుంచి అంబేడ్కర్ సెంటర్ వరకు ప్రదర్శన కొనసాగింది. వక్ఫ్ సవరణ బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని, దీర్ఘకాలంగా ముస్లింలకు ఉన్న హక్కులను పరిరక్షించాలని కోరుతూ విస్సన్నపేట తహసీల్దారు లక్ష్మీకల్యాణికి వినతిపత్రం సమర్పించారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

మైలవరం: గర్భిణులు పౌష్టికాహారం తీసుకుని ఆరోగ్యవంతమైన బిడ్డలకు జన్మనివ్వాలని గైనకాలజిస్ట్ డాక్టర్ జరూష అన్నారు. మైలవరం ప్రభుత్వ ఆస్పత్రిలో సూపరింటెండెంట్ డాక్టర్ జయప్రకాష్ ఆధ్వర్యంలో గర్భిణులకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ జరూష మాట్లాడుతూ గర్భిణులు ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకుంటూ ఎటువంటి సమస్యలు తలెత్తకుండా డెలివరీ అయ్యే విధంగా వైద్యుల సూచనలు తీసుకోవాలన్నారు. వైద్యుల సలహా మేరకు పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలని సూచించారు. గైనకాలజిస్ట్ నిహిత, డాక్టర్ సూర్య కృష్ణ, వైద్య సిబ్బంది, గర్భిణులు పాల్గొన్నారు.

సారా కేసుల్లో నిందితుల బైండోవర్

విస్సన్నపేట: తిరువూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని విస్సన్నపేట మండలంలో సారా కేసుల్లో నిందితులను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామని ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. వేమిరెడ్డిపల్లికి చెందిన వడిత్య జాను, కొమరగిరి సంజీవరావు, కొండపర్వకు చెందిన మలావతు రాము, చంద్రుపట్లకు చెందిన బాణావతు కృష్ణ, వడిత్య రాజమ్మ, దుర్గం వెంకటేశ్వరమ్మలను విస్సన్నపేట తహసీల్దార్ లక్ష్మీకల్యాణి ఎదుట బైండోవర్ చేయగా వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారని చెప్పారు.

క్లుప్తంగా

మండుటెండలో రోడ్లపైనే గంటల సేపు..

ట్రాఫిక్ ఆంక్షలతో ప్రజల ఇబ్బందులు



సాక్షి టాస్క్‌ఫోర్స్ : సీఎం చంద్రబాబు ఆగిరిపల్లి రాక సందర్భంగా అధికారులు పెట్టిన ఆంక్షలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ట్రాఫిక్ ఆంక్షలతో ప్రజలను పోలీస్ అధికారులు ముప్పుతిప్పలు పెట్టారు. చంద్రబాబు హెలీప్యాడ్ వద్దకు చేరుకోక ముందే పోలీసులు ఊరి బయటే బారికేడ్లు పెట్టి ప్రజలను అనుమతించ లేదు. పోలీసుల తీరుతో నూజివీడు నుంచి విజయవాడకు వెళ్లే వాహనాలు భారీగా నిలిచిపోయాయి. కనీసం ఆగిరిపల్లికి వెళ్లేందుకు కూడా స్థానికులకు అనుమతి ఇవ్వకపోవడంతో మండుటెండలో నడిరోడ్డుపై నిలబడి ఇబ్బందులు పడ్డారు. సీఎం సభకు వెళ్లే కార్యకర్తల వాహనాలకు రైట్ రైట్ అని చెప్పి ప్రజలను మాత్రం గంటలసేపు నిలుపుదల చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

భూ సర్వేతో రైతులకు ప్రయోజనం

ఆర్డీఓ మాధురి



అక్కపాలెం(తిరువూరురూరల్): సమగ్ర భూ సర్వేతో రైతులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని తిరువూరు రెవెన్యూ డివిజనల్ అధికారి మాధురి అన్నారు. అక్కపాలెంలో భూముల రీసర్వే ప్రారంభించిన సందర్భంగా శుక్రవారం అవగాహన ప్రదర్శన నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రైతులకు ఖచ్చితమైన కొలతలతో సర్వే వివరాలు అందజేస్తామని, ఎటువంటి అపోహలు వద్దని చెప్పారు. అనంతరం మునుకుళ్లలో రబీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె సందర్శించారు. రైతులు తెచ్చిన ధాన్యాన్ని ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు కొనుగోలు చేయాలని, త్వరితగతిన ప్రక్రియ పూర్తి చేయాలని రైతు సేవా కేంద్ర సిబ్బందిని ఆదేశించారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు


మైలవరం: విద్యావంతులు సమాజానికి మార్గదర్శులుగా ఉండాలని కృష్ణా విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కూనా రాంజీ అన్నారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. రాంజీ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత చదువులు చదివి జూనియర్స్‌కు ఆదర్శంగా నిలవాలన్నారు. గౌరవ అతిథి ప్రొఫెసర్ బసవేశ్వరరావు, ప్రత్యేక అతిథి డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు సామాజిక స్పృహ కలిగి సమిష్టి ప్రయోజనాల కోసం శ్రమించాలన్నారు. 156 మంది విద్యార్థులకు విశ్వ విద్యాలయం ప్రొఫెసర్ రాంజీ గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లు అందజేశారు. ప్రిన్సిపాల్ ఇళ్ల రవి, వైస్ ప్రిన్సిపాల్ రంగారావు, బి సుభాషిణి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి మారెమ్మ అమ్మవారి తిరునాళ్ల



పుట్రేల(విస్సన్నపేట): పుట్రేలలోని మారెమ్మ అమ్మవారి తిరునాళ్ల మహోత్సవం ఈ నెల 12 నుంచి 16వ తేదీ వరకు జరుగుతుందని ఆలయ ఈఓ వి. దుర్గా ధనప్రసాద్ తెలిపారు. సోమవారం ఉదయం ఆరు గంటలకు అంకురార్పణ, విఘ్నేశ్వర పూజ, నవగ్రహ పూజ, మంటపారాధన, మారెమ్మ తల్లికి గుడారు వేయడం, తదనంతరం పంబల సేవ, సాయంత్రం 6 గంటలకు బొడ్డురాయి కట్టడం తదితర కార్యక్రమాలుంటాయని చెప్పారు. 13న ఉదయం పంబల సేవ, బియ్యం కొలబట్టడం, సాయంత్రం మారెమ్మ అమ్మవారి గ్రామోత్సవం, రథోత్సవం జరుగుతుందన్నారు. 14న జల బిందెలు, జమ్మి ఆనకట్టుట, పూల కప్పెర ఊరేగింపు, సాంస్కృతిక కార్యక్రమాలు, 15న అమ్మవారి ఆలయ ప్రాంగణంలో తిరునాళ్ల సందర్భంగా పొంగళ్ల సమర్పణ, 16న పుట్ట బంగారం తెచ్చే కార్యక్రమం, దీవెన బండారు తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామని వివరించారు.

సైన్స్ ఫెయిర్‌లో విద్యార్థుల ప్రతిభ



నూజివీడు: పట్టణంలోని త్రివిధ హైస్కూల్ విద్యార్థులు జన విజ్ఞాన వేదిక నిర్వహించిన రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్‌లో ప్రతిభ చూపారని ప్రిన్సిపాల్ సబ్బినేని శ్రీనివాస్ శుక్రవారం విలేకరులకు తెలిపారు. మూఢ నమ్మకాలు–విశ్వాసం విభాగంలో జిల్లా స్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాలు, సైన్స్ సాంకేతిక పరిజ్ఞానం అంశంలో జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానాలను సాధించారన్నారు. ప్రతిభ కనబరిచిన 8, 9 తరగతి విద్యార్థులు గీతిక, రక్షిత, వింధ్య, అఖిల్, సూర్య, అభిషేక్ పాల్, పవన్‌కృష్ణ, సుజిత్, మహిత్‌లను ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

పత్రికా స్వేచ్ఛను కాలరాస్తున్న కూటమి ప్రభుత్వం

వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి స్వామిదాసు

తిరువూరు: ప్రజాస్వామ్య వ్యవస్థలో కీలకమైన పత్రికా స్వేచ్ఛను కాలరాసేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు అన్నారు. 'సాక్షి' దినపత్రిక ఎడిటర్ ధనంజయ రెడ్డిపై ప్రభుత్వం అక్రమ కేసు బనాయించడాన్ని నిరసిస్తూ తిరువూరులో శుక్రవారం వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. స్వామిదాసు మాట్లాడుతూ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ, ప్రజా సమస్యలను ఎలుగెత్తి చాటే పాత్రికేయులపై రాష్ట్ర ప్రభుత్వం అక్రమ కేసులు బనాయిస్తుండటం ఎమర్జెన్సీని తలపిస్తోందన్నారు. వైఎస్సార్ సీపీపై కక్షతో నాయకులను అక్రమ అరెస్టులు చేయడం, ప్రభుత్వ అక్రమాలను ప్రశ్నించే సోషల్ మీడియా కార్యకర్తలను నిర్బంధించడం కూటమి ప్రభుత్వానికే చెల్లుతుందని విమర్శించారు. వెంటనే అక్రమ కేసులను ఎత్తివేయకపోతే ఆందోళనను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం 'సాక్షి' దినపత్రిక ఎడిటర్‌పైన, పాత్రికేయులపైన బనాయించిన అక్రమ కేసులను వెంటనే రద్దు చేయాలని కోరుతూ తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మిల్లర్ల మాయాజాలాన్ని అరికట్టాలి

ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం రాష్ట్ర నేత జమలయ్య



జి.కొండూరు: రబీ ధాన్యం కొనుగోలులో మిల్లర్ల మాయాజాలాన్ని అరికట్టి, మద్దతు ధరకే ధాన్యం కొనేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య విజ్ఞప్తిచేశారు. రబీ ధాన్యం విక్రయించుకునేందుకు రైతులు పడుతున్న అవస్థలను తొలగించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో జి.కొండూరు తహసీల్దార్ చాట్ల వెంకటేశ్వర్లుకి రైతు సంఘం నాయకులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. జమలయ్య మాట్లాడుతూ జి.కొండూరు మండల పరిధి కవులూరు, విజయవాడ రూరల్ పరిధిలో రైతులు ధాన్యం ఆరబెట్టి కొనుగోలు కేంద్రానికి తీసుకువెళితే రేపు, మాపు అని ఇబ్బంది పెడుతున్నారని మండిపడ్డారు. ధాన్యం తేమశాతం 17 లోపు ఉన్నప్పటికీ కొనుగోలు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మిల్లర్లు అందరూ ఏకమై తక్కువ ధరకు ధాన్యం కొనేందుకు కుట్ర పన్ని రైతులను నానా ఇబ్బందులు పెడుతున్నారని చెప్పారు. ధాన్యం నింపేందుకు సంచులు కూడా ఇవ్వడం లేదని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతుల సమస్యలను పరిష్కరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా కౌలు రైతు సంఘం అధ్యక్షుడు బుడ్డి రమేష్, రైతులు చెరుకూరి కుటుంబరావు, బుర్ర వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మైలవరం: మైలవరం విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతులు చేస్తున్నందున శనివారం ఉదయం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఏఈ జి. రమేష్ తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని చెప్పారు.

- **మైలవరం:** మైలవరం మండలం గణపవరం, వెల్వడం విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో మరమ్మతులు నిమిత్తం శనివారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని గణపవరం విద్యుత్ ఏఈ సీహెచ్ రామ్మోహనరావు తెలిపారు.
- **తిరువూరు:** గంపలగూడెం మండలంలో శనివారం ఉదయం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఏఈ వాసు తెలిపారు. లైన్ల పునరుద్ధరణ పనుల కారణంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అన్ని గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని చెప్పారు.

వీధి కుక్కల స్వైరవిహారం

పశువులు, దూడలపై దాడులు

కొటికలపూడి(ఇబ్రహీంపట్నం): కొటికలపూడి గ్రామంలో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. కనిపించిన పశువులు, వ్యక్తులపై దాడి చేస్తున్నాయి. శుక్రవారం జొన్నలగడ్డ వెంకటేశ్వరరావుకు చెందిన దూడపై కుక్కల దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. రెండు రోజుల కిందట మల్నీడి సాంబశివరావు దూడపై కుక్కలు దాడి చేశాయి దూడ లేకపోవడంతో గేదె పాలు ఇవ్వడం మానేసింది. దీనితో రూ.లక్ష పలికే గేదెను సగానికి కంటే తక్కువకు యజమాని అమ్ముకున్నాడు.